సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 19 । ఆగస్టు । 2025



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.20 వేలు, కనిష్టంగా రూ.10 వేల ప్రకారం ధర పలికాయి.



మహిళా ప్రజాప్రతినిధులకు శిక్షణ

అనంతపురం జెడ్పీ క్యాంపస్‌లోని డీపీఆర్‌సీలో ఉమ్మడి జిల్లాలోని మహిళా జెడ్పీటీసీలు, ఎంపీపీలకు మంగళవారం నుంచి మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు జరగనున్నాయి.



జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 12 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

'పరిష్కార వేదిక'కు 200 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై మొత్తంగా 200 అర్జీలు అందాయి. జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన అధికారులతో సమావేశమయ్యారు. కలెక్టరేట్‌లో అర్జీ ఇస్తే సమస్య పరిష్కారం అవుతుందన్న నమ్మకంతో జిల్లా నలుమూలల నుంచి ప్రజలు ఇక్కడి వరకూ వచ్చి అర్జీలు ఇస్తారని, వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అర్జీలను పరిష్కరించే క్రమంలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పూర్తి స్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్దిష్ట గడువులోపు సమస్య పరిష్కరించాలన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో ప్రజల నుంచి అందే అర్జీలు పెండింగ్ లేకుండా పరిష్కరించాలని, ఇందులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ హెచ్చరించారు. సోమవారం ఆయన.. కలెక్టరేట్ నుంచి ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రీవెన్స్, ఐ గాట్ కర్మయోగి, ఈ–కేవైసీ, పట్టాదార్ పాసు బుక్కులు, ఆధార్ సీడింగ్ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే అర్జీల పరిష్కారం కోసం అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. 'ఐ గాట్ కర్మయోగి'కి సంబంధించిన ప్రక్రియ మొత్తం పూర్తి చేయాలని, ప్రతి ఉద్యోగికీ శిక్షణ ఇచ్చి పూర్తి చేసేలా ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆధార్ సీడింగ్ పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని, ఈ–కేవైసీ పట్టాదార్ పాస్‌బుక్స్‌లో ఫొటో అప్‌లోడు చేయాలన్నారు. అన్నదాత సుఖీభవకు సంబంధించిన రైతుల భూమి వివరాలు పోర్టల్‌లో జాగ్రత్తగా అప్‌లోడ్ చేయాలన్నారు.

యూరియా పంపిణీలో మాయ

- రైతులు తీసుకోకపోయినా తీసుకున్నట్లు నమోదు
- యూరియా అందక రైతుల పడిగాపులు



ఎరువుల కోసం సొసైటీ వద్ద వేచి చూస్తున్న రైతులు

లేపాక్షి: యూరియా కొరతతో రైతులు అల్లాడుతుంటే...తగు చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం కుట్రకు తెరతీసింది. రైతులు యూరియా తీసుకోకపోయినా తీసుకున్నట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసి యూరియా కోసం వచ్చిన రైతులను వెనక్కు పంపుతోంది. వివరాల్లోకి వెళితే... పలువురు రైతులు సోమవారం యూరియా కోసం కొండూరు సొసైటీ వద్దకు వెళ్లారు. ఆధార్ నంబర్‌ను కంప్యూటర్‌లో నమోదు చేయించగా... ఇదివరకే యూరియా పొందినట్టు చూపించడంతో ఎరువులు కోసం వచ్చిన రైతులు ఆందోళనకు దిగారు. తాము ఎక్కడా యూరియా తీసుకోక పోయినా యూరియా తీసుకున్నట్లు ఎలా నమోదు చేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధంగా మండల వ్యాప్తంగా 15 మంది నుంచి 20 మంది రైతులు వరకు ఎరువులు తీసుకోక పోయినా తీసుకున్నట్టు నమోదు చేయడం ఏమిటని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము రైతు సేవా కేంద్రాలు, వ్యవసాయ కార్యాలయం, ప్రైవేటు ఎరువుల దుకాణాల్లో గాని యూరియా పొందలేదన్నారు. తమ పేరుతో ఎరువులను అమ్ముకున్నారా అని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు ఎలాంటి సమాధానం ఇవ్వలేకపోయారు. కాగా, మండలానికి 950 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని వ్యవసాయాధికారిని శ్రీలత తెలిపారు. అయితే మండలానికి ఇప్పటి వరకు 12.600 మెట్రిక్ టన్నులు మాత్రమే స్టాకు వచ్చిందని సొసైటీ కార్యదర్శి కృష్ణారెడ్డి తెలిపారు. ఒక్కో పాసుపుస్తకానికి రెండు, మూడు బ్యాగ్‌ల యూరియా అవసరం ఉన్నప్పటికీ... ఎరువు కొరత కారణంగా ఇవ్వలేకపోయామని, ఉన్న స్టాకులో రైతులకు సర్దుబాటు చేస్తున్నామని తెలిపారు.

పింఛన్లు పీకేశారు!

- కూటమి 'దివ్య'మైన మోసం
- పునఃపరిశీలనకు 34,967 మంది దివ్యాంగులు
- ఉత్తుత్తి పరిశీలనతో సగం మంది పింఛన్ల రద్దు
- గగ్గోలు పెడుతున్న అభాగ్యులు
- నోటికాడ కూడు లాక్కోవద్దని వేడుకోలు
- మరోసారి పరిశీలించి న్యాయం చేయాలని వినతి



రెండుకాళ్లు వంకర్లు పోయి నడిచేందుకు కూడా వీలులేని పరిస్థితిలో ఉన్న ఈ మహిళ పేరు జన్నే అంజినమ్మ. నల్లచెరువు మండలం తిరుమల దేవరపల్లి. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు డిగ్రీ చదివినా.. ఉద్యోగం రాక ఇంటివద్దనే ఉంటున్నాడు. ఏ పనీ చేసుకోలేని అంజినమ్మకు 55 శాతం వికలత్వం ఉన్నట్లు సదరంలో సర్టిఫికెట్ ఇచ్చారు. దీంతో గత ప్రభుత్వం ఆమెకు దివ్యాంగ పింఛన్ మంజూరు చేసింది. నాలుగేళ్లుగా ఆమెకు వచ్చే ఆ పింఛనే ఆ తల్లీకొడుక్కు ఆధారం. కానీ కూటమి సర్కార్ ఏప్రిల్ నెలలో పునఃపరిశీలన పేరుతో ఆమెకు తీరని అన్యాయం చేసింది. 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉందని పెన్షన్ రద్దు చేసింది.



ఈ చిత్రంలోని యువకుడి పేరు దారా దీపక్. కదిరిలోని మగ్గాల క్వార్టర్స్‌లో ఉంటున్నాడు. బుద్ధిమాంద్యుడైన దీపక్‌కు కళ్లు కూడా సరిగా కనిపించవు. నడవడానికి కాళ్లు సహకరించవు. దీంతో గత ప్రభుత్వం దీపక్‌కు దివ్యాంగ పింఛన్ అందించి ఆదుకుంది. కానీ కూటమి సర్కార్ గత నెలలో పునఃపరిశీలన పేరుతో పింఛన్‌ను తొలగించింది.

... ఇలా జిల్లా వ్యాప్తంగా దాదాపు 15 వేల మంది దివ్యాంగుల పింఛన్‌ను కూటమి సర్కార్ పీకేసినట్లు తెలుస్తోంది. పునఃపరిశీలన పేరుతో తీరని అన్యాయం చేసింది. నడవలేని స్థితిలో ఉన్నవారు, పుట్టు అంధుల పింఛన్లకూ కోత వేసింది. దీంతో పింఛన్‌పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న అభాగ్యులు గగ్గోలు పెడుతున్నారు.



డీఆర్‌డీఏ జిల్లా కార్యాలయం

2,64,665 జిల్లాలో మొత్తం పెన్షన్లు	**1,715** 15 వేల పెన్షన్లు
34,967 పునఃపరిశీలనకు వచ్చిన దివ్యాంగ పెన్షన్లు	**561** రూ.10 వేల పెన్షన్లు

పుట్టపర్తి అర్బన్: కొత్త పింఛన్లు ఇస్తున్నామని ఊరూరా ప్రచారం చేస్తున్న కూటమి సర్కార్... ఉన్న పింఛన్లనూ పీకేస్తోంది. ముఖ్యంగా ఏ పనీ చేసుకోలేని నిస్సహాయ స్థితిలో ఉన్న దివ్యాంగులకు తీరని అన్యాయం చేస్తోంది. పునఃపరిశీలన పేరుతో వేలాది మందికి పింఛన్లు తొలగించి వేడుక చూస్తోంది.

పునఃపరిశీలన పేరుతో కుట్ర

కూటమి సర్కార్ పేదలకు అందజేసే పింఛన్లపై కన్నేసింది. ఎలాగైనా పింఛన్లకు కోత వేయాలని కంకణం కట్టుకుంది. ఈక్రమంలోనే తొలుత రూ.15 వేలు పొందుతున్న 1,715 మంది పింఛన్లు రద్దు చేసింది. రెండో విడతలో రూ.10 వేలు తీసుకుంటున్న 561 మందిని పునఃపరిశీలనకు పిలిపించి 280 మందికిపైగా పింఛన్లను తొలగించింది. ఇవన్నీ బోగస్ పింఛన్లంటూ మంచానికి పరిమితమైన వారినీ హేళన చేసింది. తాజాగా దివ్యాంగుల పింఛన్లకు కోత పెట్టేందుకు పునఃపరిశీలన పేరుతో కుట్రకు తెరలేపింది. ఇందులో భాగంగా 3 నెలల నుంచి 34,967 మంది దివ్యాంగ పింఛన్ దారులను జిల్లాలోని వివిధ కమ్యూనిటీ హెల్త్ ఆస్పత్రులకు పంపి వారి వైకల్య శాతాన్ని పునఃపరిశీలన చేయించింది. పేరుకు పునఃపరిశీలన అని చెబుతున్నా... అక్కడి వైద్యులు దివ్యాంగులను కనీసం చూడలేదు. వారికి ఏమైంది...ఎంత మేర వైకల్యం ఉందో కూడా పరిశీలించలేదు. కేవలం వారి వద్ద గతంలో ఉన్న సదరం ధ్రువీకరణ పత్రాన్ని తీసుకొని తిప్పి పంపారు. ఆ తర్వాత ఇష్టానుసారం వికలత్వ శాతం నమోదు చేశారు. దీంతో చాలా మంది అర్హత ఉండీ పింఛన్ కోల్పోయారు. గతంలో 70 శాతం వికలత్వం ఉన్న వారికి తాజాగా 40 శాతం లోపు వికలత్వం ఉన్నట్లు నిర్ధారించారు. దీంతో వారంతా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి నెలా కోతలే..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 2024 జూలై నాటికి జిల్లాలో 2,70,973 మంది పింఛన్ అందుకునే వారు. వీరి కోసం గత ప్రభుత్వం రూ.184.71 కోట్లు నిధులు వెచ్చించేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరకు పింఛన్ల సంఖ్య 2,64,665 (ఈనెలలో నూతనంగా వితంతు పెన్షన్లు 4 వేలు మంజూరు చేసిన వాటితో కలిపి) ఉన్నాయి. ఈ ఏడాదిన్నరలో సుమారు 10 వేల పింఛన్లు రద్దు చేశారు. ఇక 3 నెలల నుంచి పునఃపరిశీలన పేరుతో సుమారు 15 వేలకుపైగా దివ్యాంగుల పింఛన్లు రద్దు చేసినట్లు తెలుస్తోంది. రద్దయిన పింఛన్ లబ్ధిదారుల వివరాలను డీఆర్‌డీఏకు కూడా పంపకుండా కేవలం సచివాలయాలకే పంపి గుట్టుగా లబ్ధిదారులను పిలిపించి 'మీ పెన్షన్ రద్దు అయ్యింది.. మళ్లీ సదరం శిబిరానికి వెళ్లి సర్టిఫికెట్ తీసుకురండి' అంటూ సచివాలయ సిబ్బంది సూచిస్తున్నారు.

ఇంకెంతమందిని వీధినపడేస్తారో..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి నెలా ఠంచన్‌గా నగదు అందజేసే వారనీ, దీంతో తమకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేదని పలువురు దివ్యాంగులు చెబుతున్నారు. కానీ కూటమి ప్రభుత్వం తమపై కక్ష గట్టిందని వాపోతున్నారు. ఎలాంటి పనిచేయలేని స్థితిలో ఉన్న తమకు పింఛన్ సొమ్మే ఆధారమని, ఇప్పుడా పింఛన్ అందకపోతే కుటుంబ పోషణ ఎలాగో తెలియదని వాపోతున్నారు. కూటమి సర్కార్ ఇంకెంతమంది దివ్యాంగుల పింఛన్లు రద్దు చేసి వీధినపడేస్తుందోనని భయపడుతున్నారు.

పునఃపరిశీలన ఉంటుంది



పూర్తి అర్హత ఉంటే దివ్యాంగ పెన్షన్ తిరిగి వస్తుంది. ఎవరూ ఆందోళన చెందాల్సి అవసరం లేదు. అర్హులంతా మళ్లీ పునఃపరిశీలనకు వెళ్లవచ్చు. సచివాలయాలకు వెళ్లిన జాబితా మాకు ఇంకా అందలేదు. పూర్తి వివరాలు తెలియవు. ప్రభుత్వం ఏవైనా సూచనలు చేస్తుందేమో వేచి చూద్దాం.

– నరసయ్య, పీడీ, డీఆర్‌డీఏ

అర్హత ఉన్నా.. పింఛన్లు తొలగించారు

- జాయింట్ కలెక్టర్‌కు మొరపెట్టుకున్న వృద్ధులు



తమ అర్హతకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను చూపుతున్న వృద్ధులు

ప్రశాంతి నిలయం: ''మేము ఏళ్లుగా సామాజిక పింఛన్లు తీసుకుంటున్నాం..మాకు పింఛన్ పొందేందుకు అన్ని అర్హతలు ఉన్నాయి. అయినా మా పింఛన్లు తొలగించారు. పింఛన్ డబ్బుతో జీవనం సాగించే మాకు అన్యాయం చేయకండి'' అంటూ పలువురు వృద్ధులు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు మొరపెట్టుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన వృద్ధులు నల్లమాడ రమణప్ప, నాగమణి, రామాంజినమ్మ, నందిని, పాపన్న తదితరులు జాయింట్ కలెక్టర్‌ను కలసి తమ సమస్యను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమకు అర్హత ఉన్నప్పటికీ అధికారులు వృద్ధాప్య పింఛన్ల జాబితా నుంచి పేర్లు తొలగించారన్నారు. పింఛన్లు అందకపోతే తాము ఎలా జీవించాలని వారు ప్రశ్నించారు. స్పందించిన జాయింట్ కలెక్టర్ అక్కడే ఉన్న డీఆర్‌డీఏ పీడీ నరసయ్యని పిలిచి అర్హులకు పింఛన్లు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

డ్వాక్రా రుణం మంజూరు చేయడం లేదు

తాము తీసుకున్న డ్వాక్రా రుణం కంతులన్నీ సక్రమంగా చెల్లించామని, అయినా తమకు తిరిగి రుణం మంజూరు చేయడం లేదని రామగిరి మండలం దుబ్బార్లపల్లికి చెందిన పెద్దయ్య స్వామి మహిళా సంఘం సభ్యులు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్‌ను కలసిన పాదుపు సంఘం మహిళలు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. తాము తొలుత రూ.12 లక్షలు రుణం తీసుకుని పూర్తిగా చెల్లించామని, తిరిగి రుణం కావాలని కోరితే ఇచ్చేందుకు బ్యాంకర్లు కూడా ఒప్పుకున్నారన్నారు. అయితే వెలుగు అధికారులు రుణం రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. వెంటనే అధికారులపై చర్యలు తీసుకుని తమకు రుణం ఇప్పించాలని కోరారు.

కూటమి పాలనలో అన్ని వర్గాలకూ అన్యాయం



నార్శింపల్లిలో "బాబు ష్యూరిటీ... మోసం గ్యారెంటీ" పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉషశ్రీ చరణ్ తదితరులు

- చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్

గోరంట్ల: కూటమి పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం జరిగిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. అలవిగాని హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు..ఆ తర్వాత అందరినీ మోసం చేశారని మండిపడ్డారు. చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించి వారిలో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. సోమవారం ఆమె మండల పరిధిలోని నార్శింపల్లి గ్రామంలో ''చంద్రబాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ.. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి పార్టీ నాయకులు ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరుతో ఆచరణకు సాధ్యం కాని హామీలు గుప్పించి గెలిచిన తర్వాత వాటిని అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను నిలువునా మోసం చేశారని దుయ్యబట్టారు. 'తల్లికి వందనం' పథకం ద్వారా ఇంట్లో చదివే ప్రతి బిడ్డకూ రూ.15 వేలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చినా..ఏడాది దాటిన తర్వాత అనేక నిబంధనలు పెట్టి అర్హులకు పథకం అందకుండా కుట్రలు చేశారన్నారు. ఇక అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకూ ఏడాదికి రూ.20 వేలు రైతులకు అందిస్తామని చెప్పినా తొలి ఏడాది పూర్తిగా ఎగ్గొట్టారన్నారు. రెండో ఏడాది అమలు చేసినా కొందరికి రూ.5 వేలు మరికొందరికి రూ.7 వేలు.. ఇలా ఇష్టానుసారం ఇచ్చి చేతులుదులుపుకున్నారన్నారు. ఉచిత సిలిండర్లు కూడా అరకొరే అందించారన్నారు. ప్రతి మహిళకూ ఆడబిడ్డ నిధి కింద నెలకు ఇస్తామన్న రూ.1,500 ఊసే లేకుండా పోయిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కూడా కొన్ని బస్సుల్లోనే అదీ 50 కి.మీ పరిమితం చేశారన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష పార్టీ నేతలు, నాయకుల గొంతు నొక్కడానికి అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని ఉషశ్రీచరణ్ మండిపడ్డారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి నేతలు ఎన్నికల వేళ ఇచ్చిన హామీలు... గెలిచిన తర్వాత చేసిన మోసం గురించి ప్రతి గడపకు వెళ్లి వివరించాలని కార్యకర్తలు, పార్టీ శ్రేణులకు ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెంకటేశు, జెడ్పీటీసీ సభ్యుడు పాలే జయరాం నాయక్, టౌన్ కన్వీనర్ మేదర శంకర, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రఘురామిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆర్.వెంకటరెడ్డి, నార్శింపల్లి సర్పంచ్ లక్ష్మీదేవి, మాజీ సర్పంచులు పెయ్యాల వెంకటశివరెడ్డి, ఆంజనేయులు, పార్టీ ముఖ్యనాయకులు ఫక్రుద్దీన్ సాహెబ్, బూదిలి శ్రీనివాసరెడ్డి, పార్టీ జిల్లా ట్రెజరర్ బాలన్న గారిపల్లి రామకృష్ణారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు పద్మనాభరెడ్డి, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు వెళ్లి వస్తూ తిరిగిరాని లోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం
- మరో 9 మందికి గాయాలు
- మృతులు కర్ణాటక వాసులు
- ఢీకొన్న ఆర్టీసీ బస్సు, రెండు టూరిస్ట్ బస్సులు

ఆర్టీసీ బస్సు ఢీ కొని నుజ్జయిన టూరిస్ట్ బస్సు





మృతి చెందిన అనసూయమ్మ






తనకల్లు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు


తనకల్లు: తనకల్లు మండలం మండ్లిపల్లి వద్ద జాతీయ రహదారిపై సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం పాలయ్యారు. మరో తొమ్మిదిమంది తీవ్రంగా గాయపడ్డారు. ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు, రెండు టూరిస్ట్ మినీబస్సులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో టూరిస్ట్ బస్సుల్లోని అనసూయమ్మ (60) అక్కడికక్కడే మృతిచెందారు. డ్రైవర్ మణికంఠ (41), నాగేంద్రప్ప (45), జాహ్నవి (4) చికిత్స పొందుతూ మరణించారు. మృతులంతా కర్ణాటకవాసులే. పోలీసులు తెలిపిన మేరకు.. కర్ణాటకలోని బళ్లారి ప్రాంతానికి చెందిన భక్తులు రెండు టూరిస్ట్ మినీబస్సుల్లో తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లారు. దైవదర్శనం అనంతరం బళ్లారికి తిరుగు పయనమయ్యారు. మార్గమధ్యంలో మండ్లిపల్లి వద్ద జాతీయ రహదారిపై ఉన్న మలుపు వద్ద కదిరి నుంచి మదనపల్లి వెళుతున్న పల్లెవెలుగు ఆర్టీసీ బస్సును ఎదురుగా వస్తున్న టూరిస్ట్ బస్సు ఢీకొంది. ఆ వెనుకనే వస్తున్న మరో టూరిస్ట్ బస్సు ముందున్న టూరిస్ట్ బస్సును ఢీకొట్టింది. ఒకదానికొకటి బలంగా ఢీ కొనడంతో ముందున్న టూరిస్ట్ బస్సు నుజ్జునుజ్జయ్యింది. అందులో ప్రయాణిస్తున్న అనసూయమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. చిన్నారి జాహ్నవి, డ్రైవర్ మణికంఠ, నాగార్జున, కుమార్‌స్వామి, భార్గవి, రిత్విక, నాగేంద్రప్ప, గోవిందమ్మ, గోవిందప్ప, రాకేష్, చిన్నమ్మ, అంజినమ్మ తీవ్రంగా గాయపడ్డారు. మండలంలో ఉచితంగా అంబులెన్స్ సేవలు నిర్వహిస్తున్న 'వందేమాతరం టీం' సభ్యులు బాధితుల్ని తమ అంబులెన్స్‌లో తనకల్లు ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తీవ్రంగా గాయపడిన జాహ్నవి, నాగేంద్రప్ప, మణికంఠ, నాగార్జున, రిత్విక, భార్గవిలను కదిరి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. వీరిలో డ్రైవర్ మణికంఠ, నాగేంద్రప్ప, జాహ్నవి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వీరు మృతిచెందారు. తనకల్లు ఎస్‌ఐ గోపి ప్రమాదస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. ప్రమాద మృతుల కుటుంబాలకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సంతాపం తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

విద్యార్థి సంఘాల నాయకుల అరెస్ట్

ధర్మవరం: వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి వేముల అమర్‌నాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం రాయల్‌ను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. పాఠశాల ప్రాంగణంలోకి తల్లిదండ్రులు కాకుండా ఇతరులు ప్రవేశించడాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం తలపెట్టిన నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా వారిని ముందస్తుగా అరెస్టు చేసి కట్టడి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యా స్వేచ్ఛను హరించి, పాఠశాలలను జైళ్లుగా మార్చే నిరంకుశ ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల గొంతు నులిమే కుట్రలను వ్యతిరేకించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యా మండలి ఆగస్టు 1న జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం తల్లిదండ్రులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు మినహాయిస్తే ఇతర వ్యక్తులు పాఠశాల ప్రాంగణంలోకి ప్రవేశించడం, తరగతి గదుల్లోకి వెళ్లడం, విద్యార్థులతో సంభాషించడం నిషేధించారని తెలిపారు. ఈ ఉత్తర్వులు విద్యార్థులు, ఉపాధ్యాయుల స్వేచ్ఛను, ప్రజాస్వామ్య హక్కులను హరించి పాఠశాలలను జైళ్లగా మార్చేలా ఉన్నాయన్నారు. ఈ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.



హౌస్ అరెస్టులో పురుషోత్తంరాయల్



టూటౌన్ స్టేషన్‌లో ఉన్న అమర్‌నాథ్‌రెడ్డి

రైతుల్లో అలజడి

- వరుస తుపాన్లతో అన్నదాతల బెంబేలు
- చేతికొచ్చిన పంట తొలగించలేక ఇబ్బందులు



సుబ్బరాయనిపల్లిలో వర్షానికి తడిసిన వేరుశనగ పంట

పుట్టపర్తి అర్బన్: తుపాను ప్రభావంతో కురుస్తున్న జడివాన రైతుల్లో అలజడి రేపుతోంది. 15 రోజుల నుంచి రోజూ జడివాన పట్టుకోగా..పంటలకు ఇబ్బందిగా మారింది. ఖరీఫ్‌లో ముందస్తు సాగు చేసిన పంటలు తొలగించే సమయం ఆసన్నం కావడం... జడివాన తెరిపినివ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ముందస్తుగా సాగు చేసిన వేరుశనగ పంట ప్రస్తుతం పూర్తి కావొచ్చింది. ఇప్పుడు చెట్లు తొలగించక పోతే బూడిద తెగులు వ్యాపించి కాయలు భూమిలోకి పోతాయని, తొలగిస్తే వర్షానికి నాని పోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్కడక్కడా పంట తొలగించిన రైతులు తాజా వర్షాలకు వేరుశనగ కట్టె తడిసిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే పూలు, ఉల్లి, టమాట, ఇతర కూరగాయల పంటలు సాగు చేసిన రైతులు కూడా జడివానతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. జడివానతో పూలు కోసేందుకు ఇబ్బందులు కలుగుతున్నాయని, కష్టపడి మార్కెట్‌కు తరలించినా బంతిపూలు రూ.20, రూ.30కి అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు.

ఆదుకుంటున్న గోదాములు..

ఖరీఫ్‌లో ముందస్తుగా రాగి సాగుచేసిన రైతులు పంటను పీకారు. అయితే జడివానతో రాగి కంకులను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో వైఎస్ జగన్ హయాంలో నిర్మించిన బహుళ ప్రయోజన సౌకర్య గోదాములు అందుబాటులో ఉండటంతో రాగి రైతులు గింజలు ఆరబెట్టడానికి వీటిని ఉపయోగించుకుంటున్నారు. లేకపోతే పంట మొత్తం వర్షార్పణమయ్యేదంటున్నారు. చాలా ప్రాంతాల్లో మాత్రం గోదాముల సౌకర్యం లేక రాగి పంట దెబ్బతింటోంది.

243.6 మి.మీ వర్షపాతం నమోదు..

తుపాను ప్రభావంతో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకూ 31 మండలాల పరిధిలో వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అత్యధికంగా రామగిరి మండలంలో 15.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు. ఇక కొత్తచెరువు మండలంలో 14.2 మి.మీ, కదిరి 12.2, ఎన్‌పీకుంట 11.4, గుడిబండ 11.2, సోమందేపల్లి 11.2, బుక్కపట్నం 10.2, పుట్టపర్తి 10.2, తాడిమర్రి 9.8, పెనుకొండ 9.2, హిందూపురం 9.2, రొద్దం 8.8, ధర్మవరం 8.4, నల్లచెరువు 8.4, బత్తలపల్లి 8.2, లేపాక్షి 8.2, మిగతా మండలాల్లో 7 నుంచి 2.4 మి.మీ మధ్య వర్షపాతం నమోదైంది. ఈనెలలో మరో రెండు తుపాన్లు వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతుండగా రైతులు ఆందోళన చెందుతున్నారు.

క్లుప్తంగా

పరిష్కార వేదికకు 65 వినతులు


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 65 వినతులు అందాయి. ఎస్పీ రత్న స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని చట్టపరిధిలోని అంశాలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయకుమార్, మహిళా పీఎస్ డీఎస్పీ ఆదినారాయణ, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి పాల్గొన్నారు.

ఘర్షణ కేసులో ఎనిమిది మంది అరెస్ట్

నల్లమాడ: స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ మైదానంలో మూడు రోజుల క్రితం ఇరువర్గాల మధ్య చోటు చేసుకున్న ఘర్షణకు సంబంధించి సోమవారం ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు సీఐ నరేంద్రరెడ్డి తెలిపారు. అప్పు విషయమై ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకోగా అప్పట్లో పరస్పర ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఓ వర్గానికి చెందిన డేగల జనార్ధన్, మల్లెల వినోద్‌కుమార్, నరసింహయ్య, కె.కిషోర్, మరో వర్గానికి చెందిన గడ్డం తేజేశ్వర్, పి. ఆనంద్, ఎం.ధనుంజయ, నవదీప్‌ను సోమవారం ఓడీ చెరువులోని వైఎస్సార్ కూడలిలో అరెస్ట్ చేసి కదిరి కోర్టులో హాజరు పరిచినట్లు వివరించారు.

20 నుంచి కోర్టు ఉద్యోగ నియామక పరీక్షలు

అనంతపురం: జిల్లాలోని న్యాయస్థానాల పరిధిలో ఖాళీగా ఉన్న గ్రేడ్-3 స్టెనోగ్రాఫర్, జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, ఎగ్జామినర్, ఫీల్డ్ అసిస్టెంట్, కాపీయిస్ట్, రికార్డు అసిస్టెంట్, డ్రైవర్, ప్రాసెస్ సర్వర్, ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగాల భర్తీకి ఈ నెల 20 నుంచి రాత పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ.భీమారావు సోమవారం వెల్లడించారు. ప్రతి రోజూ మూడు షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 20, 21, 22, 23వ తేదీల్లో చిన్నయనగర్‌లోని ఎస్‌సీసీ ఎస్‌పీఐలో, 23, 24 తేదీల్లో బీకేఎస్ మండలం రోటరీపురం వద్ద ఉన్న ఎస్ఆర్ఐటీ, అనంతపురం రూరల్ పరిధిలోని ఇటుకలపల్లి వద్ద ఉన్న అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో, 22, 23, 24 తేదీల్లో తాడిపత్రిలోని సీవీ రామన్ ఇనిస్టిట్యూట్‌లో పరీక్షలు నిర్వహించనున్నారు. హాల్‌టికెట్ డౌన్‌లోడ్‌లో సమస్యలు ఉత్పన్నమైతే హెల్ప్ డెస్క్ (86323 72752)ను సంప్రదించవచ్చు.

విద్యార్థుల ఆరోగ్యంపై ఏదీ శ్రద్ధ?

- మొన్న కలుషిత ఆహారం, నేడు విషజ్వరాలు
- గురుకుల పాఠశాలల్లో బిక్కుబిక్కుమంటున్న విద్యార్థులు
- భయాందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

హిందూపురం టౌన్: ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వానికి శ్రద్ధ కరువైంది. జిల్లాలో రెండు నెలల వ్యవధిలోనే సోమందేపల్లి కేజీబీవీ, మలుగూరు అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు అనారోగ్యం పాలవ్వడంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హాస్టళ్లలో విద్యార్థులకు అందిస్తున్న ఆహారంలో నాణ్యత పాటించడం లేదని, అపరిశుభ్రత తాండవిస్తోంది విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. హాస్టళ్లను, కేజీబీవీలను తనిఖీ చేసి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఆ దిశగా కన్నెత్తి కూడా చూడడం లేదనే ఆరోపణలున్నాయి. వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు నెలకోసారి మెడికల్ క్యాంపు నిర్వహించి, విద్యార్థుల ఆర్యోగ పరిస్థితులను తెలుసుకుని, వారికి మందులు అందజేయాల్సి ఉంది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిన్నర కాల వ్యవధిలో ఇలాంటి చర్యలు ఎక్కడా గాని కనిపించడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన..

మలుగూరు అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలవ్వడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. అలాగే హాస్టల్‌లో ఉన్న ఇతర విద్యార్థులకు వారి వారి తల్లిదండ్రులు సంప్రదించి యోగక్షేమాలను తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తం చేశారు. హాస్టల్ పరిసరాల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. పిచ్చిమొక్కలు పెరిగాయి. దోమల వృద్ధితో విద్యార్థులు జ్వరాల బారినపడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులు అనారోగ్యం పాలైనా తల్లిదండ్రులకు కనీసం విషయం కూడా చేరవేయకుండా గుప్తంగా ఉండడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



ఈ ఏడాది జూలై 3న బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ప్రాతినిధ్యం వహిస్తున్న పెనుకొండ నియోజకవర్గం సోమందేపల్లి మండలం పాపిరెడ్డిపల్లి వద్ద ఉన్న కస్తూర్బా పాఠశాలలో కలుషిత ఆహారం కారణంగా దాదాపు 30 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. తర్వాత అది కాస్త డయేరియాకు దారి తీసి, గ్రామస్తులు సైతం తీవ్ర అస్వస్థతతో ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వచ్చింది.



ఈ నెల 15న సీఎం చంద్రబాబు వియ్యంకుడు ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న హిందూపురం మండలంలోని మలుగూరు అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు 10 మంది విషజ్వరాలతో బాధపడుతూ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. అయితే విద్యార్థులను ఆస్పత్రికి తరలించిన తర్వాత వారి తల్లిదండ్రులకు కనీసం సమాచారం ఇవ్వకపోవడం విమర్శలకు దారి తీసింది.

కూటమి సర్కార్‌కు విపక్షాలపై కుట్రలు చేయడం తప్ప విద్యార్థుల ఆరోగ్యం పట్టడం లేదనేందుకు ఈ రెండు ఘటనలూ ఉదాహరణ మాత్రమే.

జిల్లాలో ప్రభుత్వ వసతి గృహాలు	
బీసీ వెల్ఫేర్	60
ఎస్సీ వెల్ఫేర్	14
ఎస్టీ వెల్ఫేర్	05
జిల్లాలో గురుకుల పాఠశాలలు	
కేజీబీవీలు	30
మహాత్మా జ్యోతిబాపూలే	10
అంబేడ్కర్ గురుకులాలు	05
మోడల్ స్కూళ్లు	09

మరీ అధ్వానం



విద్యాశాఖ మంత్రికి పిల్లనిచ్చిన మేనమామ అయిన సినీ హీరో బాలకృష్ణ సొంత నియోజకవర్గమైన హిందూపురంలోనే హాస్టళ్లు, గురుకుల పాఠశాలల నిర్వహణ చాలా అధ్వానంగా ఉంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కళ్లు తెరిచి ఇలాంటి ఘటనలో పునరావృతం కాకుండా చూడాలి. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడడం మానాలి. హాస్టళ్లు, గురుకులాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు, వైద్య సేవలు అందించాలి.

– కదిరీష్, జిల్లా ఉపాధ్యక్షుడు, వైఎస్సార్‌ఎస్‌యూ

విద్యార్థులకు రక్షణ కరువు



గురుకుల పాఠశాలల్లో శుభ్రత లోపించింది. దోమలు ఎక్కువ కావడంతో విద్యార్థులు విష జ్వరాల బారిన పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటనలకు మాత్రమే పరిమితం కాకుండా క్షేత్ర స్థాయిలో నిర్ధారించుకుంటే మంచిది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి. గురుకుల పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక నిధులు కేటాయించాలి.

– బాబావలి, జిల్లా అధ్యక్షుడు, పీడీఎస్‌యూ

చేనేత కార్మికుడి బలవన్మరణం


లక్ష్మీపతి (ఫైల్)

లేపాక్షి: జీవితంపై విరక్తితో ఓ చేనేత కార్మికుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన మేరకు.. లేపాక్షి మండలం బయన్నపల్లికి చెందిన లక్ష్మీపతి (35)కి భార్య, ఓ కుమార్తె ఉన్నారు. లేపాక్షిలో చేతి మగ్గాలపై వస్త్రాలు నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో కొంత కాలంగా అనారోగ్యం బారిన పడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స పొంది నాలుగు రోజుల క్రితం డిశ్చార్జ్ అయి ఇంటికి చేరుకున్నాడు. జబ్బు నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం తెల్లవారుజామున రేకుల షెడ్డుకున్న ఇనుప కడ్డీకి తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఆదెప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నేత్రదానంతో ఇద్దరికి చూపు


సేకరించిన నేత్రాలను అందిస్తున్న మృతుని కుటుంబ సభ్యులు

ధర్మవరం అర్బన్: మరణానంతరం నేత్రదానంతో ఇద్దరికి చూపును అందించవచ్చునని రోటరీక్లబ్ సభ్యులు శివయ్య, రమేష్, బీవీ చలం, శ్రీనివాసరెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన పోలా నారాయణప్ప(89) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రోటరీక్లబ్ సభ్యులు మృతుని కుటుంబ సభ్యులను కలిసి నేత్రదానంపై అవగాహన కల్పించడంతో వారు అంగీకరించారు. దీంతో మృతుడి నేత్రాలను జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ డాక్టర్ కుళ్లాయప్ప, కంటి రెట్రావైల్ సెంటర్ టెక్నీషియన్ రాఘవేంద్ర సేకరించారు. నేత్రదానానికి సహకరించిన మృతుని కుటుంబ సభ్యులకు రోటరీ క్లబ్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బార్ల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా 2025–28 సంవత్సరానికి గాను 11 మద్యం బార్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, సూపరింటెండెంట్ గోవిందనాయక్, ఏఈఎస్ నరసింహులు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కదిరి, ధర్మవరం, హిందూపురంలో 3 చొప్పున, మడకశిర, పెనుకొండలో ఒక్కొక్కటి చొప్పున 11 బార్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. జనాభా ప్రాతిపదికన లైసెన్స్ ఫీజు మొత్తాన్ని నిర్దేశించినట్లు తెలిపారు. వేలం పద్ధతిలో కాకుండా, లక్కీ డ్రా ఆధారంగా కేటాయిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయంలో ఈ నెల 26న సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులు అందజేయాలన్నారు. 28వ తేదీ ఉదయం 8 గంటలకు పుట్టపర్తిలోని సాయి ఆరామంలో లక్కీ డ్రా ద్వారా అర్హులను ఎంపిక చేస్తామన్నారు. బార్ల లైసెన్స్ పొందిన 15 రోజుల్లోపు ఏర్పాటు చేసుకోవాలని, మొత్తం లైసెన్స్ ఫీజును ఆరు వాయిదాల్లో చెల్లించవచ్చునన్నారు.

కర్మాగారంలో వలస కార్మికుడి మృతి


మృతుడు శంభు పాశ్వన్

హిందూపురం: స్థానిక గోళాపురం పారిశ్రామిక వాడలోని ఏ1 ఇస్పాత్ స్టీల్ ఫ్యాక్టరీలో చోటు చేసుకున్న ప్రమాదంలో బిహార్‌కు చెందిన వలస కార్మికుడు శంభు పాశ్వన్ (40) మృతి చెందాడు. సోమవారం రాత్రి పనిలో నిమగ్నమై ఉన్న సమయంలో శరీరంలోకి ఇనుప రాడ్ దూసుకెళ్లింది. తీవ్ర రక్తస్రావంతో కుప్పకూలిన కార్మికుడిని వెంటనే హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే కార్మికుడు మృతిచెందినట్లు ధ్రువీకరించారు. ఘటనపై హిందూపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి


సందీప్‌రెడ్డి (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: విద్యుత్ షాక్‌కు గురై ఓ యువరైతు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు.. సీకేపల్లి మండలం వెంకటాంపల్లి గ్రామానికి చెందిన సందీప్‌రెడ్డి (36)కి భార్య మౌనిక, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. తన పొలంలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. సోమవారం ఉదయం పంటకు నీరు పెట్టేందుకు వెళ్లిన సందీప్‌రెడ్డి.. మోటార్ ఆన్ చేసేందుకు స్టార్టర్ పెట్టెను తాకగానే విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని సందీప్‌రెడ్డి మృతదేహంపై పడి రోదించిన తీరు చూపరులను కంట తడి పెట్టించింది. భార్య మౌనిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతుడి సోదరుడు జయరామిరెడ్డి ప్రస్తుతం వెంకటంపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఉన్నారు. విషయం తెలుసుకున్న పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

యువకుడి ఆత్మహత్య


ప్రకాష్ చౌదరి (ఫైల్)

తాడిమర్రి: మండలంలోని చిల్లకొండయ్యపల్లికి చెందిన మద్దినేని మనోహర్ నాయుడు, రమణమ్మ దంపతుల ఒక్కగానొక్క కుమారుడు ప్రకాష్‌చౌదరి (22) అనంతపురంలో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. బీటెక్ పూర్తి చేసి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండే ప్రకాష్ చౌదరి అక్కడ పని మానేసి ఇరవై రోజుల క్రితం అనంతపురానికి చేరుకున్నాడు. తన స్నేహితులతో కలసి ఆదర్శ నగర్‌లో అద్దె గదిలో ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు మొదలు పెట్టాడు. అయితే ఉద్యోగ ప్రయత్నాలు ఫలించకపోవడంతో సోమవారం తెల్లవారు జామున గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు హుటాహుటిన అనంతపురానికి వెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, కుమారుని నేత్రాలను తల్లిదండ్రులు దానం చేశారు.

విద్యుత్ తీగలతో జాగ్రత్త

పుట్టపర్తి టౌన్: వర్షాలు కురుస్తున్న సమయంలో విద్యుత్ తీగలతో జాగ్రత్తగా ఉండాలని జిల్లా వాసులకు విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ సూచించారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

వర్ధమాన క్రీడాకారులతో చెడుగుడు

- క్రీడల్లో గిరిజన విద్యార్థులు రాణించకుండా సర్కార్ అడ్డుపుల్ల
- అగమ్యగోచరంగా స్పోర్ట్స్ స్కూళ్ల పరిస్థితి

క్రీడల అభివృద్ధికి కూటమి సర్కార్ సహకారం పూర్తిగా కొరవడింది. కొన్నేళ్లుగా మితిమీరిన రాజకీయ జోక్యం వర్ధమాన క్రీడాకారుల పాలిట శాపంగా మారింది. ఇది అణగారిన గిరిజన విద్యార్థుల ఉజ్వల భవితకు ఆటంకంగా మారింది.


స్పోర్ట్స్ స్కూల్‌లో సాధన చేస్తున్న విద్యార్థులు

అనంతపురం: క్రీడా కుసుమాలను వెలికితీయాలంటే క్షేత్ర స్థాయిలో యువతను ప్రోత్సహించాలి. మట్టిలో మాణిక్యాలకు సరైన శిక్షణ ఇచ్చి వారిలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని మెరుగుపరచాలి. ఈ ఉద్దేశంతోనే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గిరిజన విద్యార్థుల కోసం స్పోర్ట్స్ స్కూళ్లను ఏర్పాటు చేసింది. విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో రాణించేలా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా కోచ్‌లనూ నియమించింది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడగానే గిరిజన విద్యార్థుల క్రీడావకాశాలపై కోలుకోలేని దెబ్బ తీసింది. స్పోర్ట్స్ స్కూళ్లలో అడ్మిషన్లు సైతం నిలిపి వేసి వర్ధమాన క్రీడాకారుల జీవితాలతో చెడుగుడు ఆడుకుంటోంది.

నాడు రాణింపు..

గిరిజన విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసి జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ క్రమంలో అల్లూరి జిల్లా అరకులో ఉన్న ఏపీటీడబ్ల్యూఆర్ స్పోర్ట్స్ స్కూల్‌కు అనుబంధంగా రాష్ట్రంలో ఆరు క్రీడా పాఠశాలలు ఏర్పాటు చేశారు. దీంతో పార్వతీపురం మన్యం జిల్లాలోని సీతంపేట (బాలురు), భద్రగిరి (బాలికలు), తూర్పుగోదావరి జిల్లా మునురుమిల్లి (బాలురు), ప్రకాశం జిల్లా యర్రగొండ పాలెం (పీజీటీ–బాలురు), నంద్యాల జిల్లా మహానంది (బాలికలు), అనంతపురం జిల్లా గొల్లలదొడ్డి (బాలురు)లో స్పోర్ట్స్ స్కూళ్లు అందుబాటులోకి వచ్చాయి. గొల్లలదొడ్డిలోని స్పోర్ట్స్ స్కూల్‌లో అథ్లెటిక్స్, బాక్సింగ్, ఫుట్‌బాల్, వెయిట్ లిఫ్టింగ్ అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఆయా పాఠశాలల్లో 720 మంది బాల, బాలికలు ఆటల పోటీల్లో ప్రతిభాపాటవాలు ప్రదర్శించే అవకాశం కల్పించారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ, గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ విద్యా సంస్థలు సంయుక్తంగా నిర్వహించే ఈ స్పోర్ట్స్ స్కూళ్లు 2022లో ఏర్పాటయ్యాయి. ఒక్కో ఈవెంట్‌కు ఒకరు చొప్పున మొత్తం 23 మంది కోచ్‌లను నియమించారు. క్రీడా పాఠశాలల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి అడ్మిషన్ కల్పించేవారు. దీంతో నాడు అనేక మంది గిరిజన విద్యార్థులు తమకు అందుబాటులో ఉన్న స్పోర్ట్స్ స్కూల్‌లో చేరి క్రీడా నైపుణ్యాన్ని మెరుగు పరుచుకుని అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లోనూ రాణించారు.

అడ్మిషన్లకు నిరాకరణ..

గిరిజన విద్యార్థుల్లోని క్రీడా ప్రతిభను కూటమి ప్రభుత్వం తొక్కి పెట్టింది. ప్రభుత్వం ఏర్పడి దాదాపు 14 నెలలు కావస్తున్నా.. స్పోర్ట్స్ స్కూళ్లలో ఒక్క గిరిజన విద్యార్థికి కూడా అడ్మిషన్ ఇచ్చిన పాపాన పోలేదు. కోచ్‌లు ఉన్నప్పటికీ విద్యార్థుల అడ్మిషన్లు లేకపోవడంతో మొత్తం ఆరు స్పోర్ట్స్ స్కూళ్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. దీంతో ప్రభుత్వ తీరుపై గిరిజన సంఘాల నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్పోర్ట్స్ స్కూళ్లలో అడ్మిషన్లు కల్పించడకపోవడం వల్ల గిరిజన విద్యార్థులు తమలోని క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించే అవకాశం కోల్పోతున్నారని ఆందోళన చెందుతున్నారు. గిరిజన పిల్లలు క్రీడల్లో ఎదగకుండా ఈ ప్రభుత్వం ఎందుకు కక్ష కట్టిందో అర్థం కావడం లేదని వాపోతున్నారు.

నేటి నుంచి బెహలూల్ షా బాబా ఉత్సవాలు

పెనుకొండ: స్థానిక 44వ జాతీయ రహదారి పక్కన వెలసిన హజ్రత్ సయ్యద్ బెహలూల్ షా ఖాద్రీ షహీద్ ఉరుసు ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 19న జెండా ఆవిష్కరణ, 20న గంధం, 21న దీపారాధన ఉత్సవాలు ఉంటాయని దర్గా పీఠాధిపతి ఆదోని షేక్-షా-వలి తెలిపారు.

పోలీసుల అదుపులో దోపిడీ దొంగల ముఠా

తనకల్లు: మండలంలోని దిగువ చెక్కవారిపల్లి, ఎగువ చెక్కవారిపల్లి మధ్య ఉన్న కొండగుట్టల్లో గుడారాలు వేసుకుని తలదాచుకున్న దోపిడీ దొంగల ముఠాను సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నంద్యాల జిల్లా పాణ్యం ప్రాంతంలో ఈ ముఠా సభ్యులు పెద్ద ఎత్తున దోపిడీలు, దొంగతనాలు చేయడమే కాకుండా మహిళలపై అత్యాచారాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. దీంతో స్థానిక పోలీసులు, గ్రామస్తుల సహకారంతో కొండ గుట్టల్లోని గుడారాలను పాణ్యం పోలీసులు చుట్టుముట్టి ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. వలలు వేసి అడవి పందులను పట్టుకునే తరహాలోనే పది మంది దొంగలను అదుపులోకి తీసుకుని, బంగారు నగలు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న స్థానిక మీడియా ప్రతినిధులు సంఘటనా స్థలానికి చేరుకునే ప్రయత్నం చేయగా మార్గమధ్యంలోనే పోలీసులు అడ్డుకున్నారు. కాగా, ఘటనపై స్థానిక పీఎస్ ఎస్ఐ గోపిని వివరణ కోరగా.. పలు కేసుల్లో అనుమానితులుగా ఉన్నవారు గుట్టల్లో టెంట్లు వేసుకుని ఉన్నట్లుగా గుర్తించిన పాణ్యం పోలీసులు వారిని అదుపులోకి తీసుకొన్నారని తెలిపారు.

మామపై కోడలి కుటుంబ సభ్యుల దాడి

ధర్మవరం అర్బన్: మామపై కోడలి తండ్రి, సోదరుడు దాడి చేసిన ఘటన ధర్మవరంలో సోమవారం జరిగింది. టూ టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు.. శారదానగర్‌కు చెందిన చంద్రాయుడు నాయక్ తన కుమారుడు చంద్రానాయక్, కోడలు రజితబాయితో కలసి ఉంటున్నాడు. పది రోజులుగా మామతో కోడలు గొడవపడుతుండేది. సోమవారం మరోసారి గొడవ పెట్టుకున్న కోడలు తన పుట్టింటికి వెళ్లి తండ్రి బాలాజీనాయక్, సోదరుడు శ్రీకాంత్‌నాయక్‌ను పిలుచుకు వచ్చింది. ఆ సమయంలో చంద్రాయుడునాయక్‌పై బాలాజీనాయక్, శ్రీకాంత్‌నాయక్ కట్టెలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బాలాజీనాయక్, శ్రీకాంత్‌నాయక్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో భార్య గొంతు కోసిన భర్త

అనంతపురం: మద్యంలో మత్తులో ఇల్లాలి గొంతును భర్త కోశాడు. అనంతపురం పోలీసులు తెలిపిన మేరకు.. శ్రీసత్యసాయి జిల్లా ఓబులంపల్లి తండాకు చెందిన రవి నాయక్, భాగ్యబాయి దంపతులు ధర్మవరంలో కూలి పనులతో జీవనం సాగించేవారు. రవి నాయక్ తాగుడుకు బానిస కావడంతో 20 రోజుల క్రితం భాగ్యబాయి తన ఇద్దరు పిల్లలను తీసుకుని అనంతపురం లోని ఓబులదేవరనగర్‌లో మకాం మార్చి అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. రెండు రోజుల క్రితం భాగ్యబాయి వద్దకు వచ్చిన రవినాయక్.. సోమవారం మద్యం సేవించి భార్యతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో కత్తి తీసుకుని భాగ్య బాయి గొంతు కోసి పరారయ్యాడు. పొరుగింటి వారు తక్షణమే స్పందించి ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం భాగ్య బాయి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.